ప్రజాశక్తి
బుధవారం 19 ఏప్రిల్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

టిడిపి కౌన్సిలర్ దారుణహత్య

పార్టీలో గ్రూపుల పోరే కారణం! 3లో

వైసిపి శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి


పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మస్తాన్‌రావు, మంత్రి సురేష్ 8లో

నేటి నుంచి 'పశ్చిమ'లో చంద్రబాబు..

- మూడు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు
- ఎజెండాలో మార్కాపురం జిల్లా ప్రకటన.. వెలుగొండ ప్రాజెక్టు
- అధినేత పర్యటనకు అన్ని ఏర్పాట్లూ చేసిన జిల్లా నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం అధినేత చంద్రబాబు బుధవారం నుంచి మూడు రోజుల పాటు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పర్యటించనున్నారు. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. పశ్చిమాన కీలకమైన ఈ మూడు నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీకి పూర్వవైభవం తెచ్చే వ్యూహంలో ఆయన ఈ మూడు నియోజకవర్గాలను ఎంపిక చేసుకున్నారు. పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని తెచ్చేందుకు... గతంలో పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన వారిని తిరిగి రాబట్టుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో బహిరంగసభలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా నేతలు వారం రోజులుగా చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై దృష్టి సారించారు. బహిరంగసభలు జరిగే స్థలాలను ఎంపిక చేసి అన్ని ఏర్పాట్లూ చేశారు. పార్టీ కార్యకర్తల్లో కదలిక వచ్చింది. చంద్రబాబునాయుడు తన జన్మదిన వేడుకలు 20న మార్కాపురంలోనే జరుపుకోనున్నారు. జిల్లా నేతలు అందుకు ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిగా ఉన్న ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, గూడూరి ఎరిక్షన్‌బాబు జన సమీకరణపై దృష్టి సారించారు. ఉమ్మడి



జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవి కుమార్, ఏలూరి సాంబశివరావు, వీరాంజనేయస్వామి, ముఖ్య నేతలు దామచర్ల జనార్ధన్, నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తదితరులు పర్యటనపై కేంద్రీకరించారు. ఈ మూడు నియోజకవర్గాల్లో చంద్రబాబు ప్రసంగంలో రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానికంగా ఉన్నవాటిని కీలకంగా ప్రస్తావించనున్నట్లు నేతలు చెబుతున్నారు. మూడు నియోజకవర్గాల్లో తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించే అవకాశం ఉంది. వీటితో పాటు రెండు కీలక ఎజెండాలే ఇక్కడ ప్రస్తావనకు రానున్నాయి. ప్రధానంగా వెలిగొండ ప్రాజెక్టుపైనా దృష్టి సారించారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు దాన్ని పూర్తిచేసే బాధ్యత కూడా తనదేనని గతంలో ప్రకటించారు. దీన్నే మూడు నియోజకవర్గాల్లో ప్రకటన ▶ 2లో

నేడు గిద్దలూరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి - గిద్దలూరు

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం గిద్దలూరు రానున్నారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా పట్టణంలోని ఒంగోలు హైవేలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో ముమ్మరంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈ ఏర్పాట్లను ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే విజయ్ కుమార్, టిడిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఎం.ఎం. కొండయ్య, టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పరిశీలించారు. గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి అధిక ప్రాధాన్యమిస్తూ గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో చంద్రబాబు నాయుడు పర్యటించనున్నట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం చంద్రబాబు కడప జిల్లా బద్వేల్ నుంచి రోడ్డుమార్గాన గిద్దలూరు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్‌షో ద్వారా బస్టాండ్ సమీపంలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ మైదానంలో ఏర్పాటు సభలో పాల్గొంటారని తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దామచర్ల జనార్ధన్, అశోక్‌రెడ్డి



సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నేటి నుంచి 'పశ్చిమ'లో చంద్రబాబు..

(మొదటిపేజీ తరువాయి)

చేయనున్నారు. 1996లో వెలిగొండకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే అప్పట్లో పనులు మొదలుకాలేదు. 2004లో దీని పనులు మొదలయ్యాయి. డ్యాములతో పాటు రెండు సొరంగాలు చేపట్టారు. 2014లో చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక పనులు కొంతమేరకు జరిగాయి. మొదటి సొరంగం ఇటీవలే పూర్తయింది. రెండో సొరంగం పూర్తికావాల్సి ఉంది. మార్కాపురంలో ఈబీసీ నేస్తం సభలో సిఎం జగన్ దీనిపై కీలక ప్రకటన చేశారు. అక్టోబరులో వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. అయితే అప్పటికి పనులు పూర్తికావనే చర్చ ఉంది. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. ఇందుకోసం రూ.1200 కోట్లకు పైగానే నిధులు కావాలి. నిర్వాసితుల జాబితాలు పూర్తిగా సిద్ధం కాలేదు. ఈ కారణాల రీత్యా అక్టోబరు నాటికి వెలిగొండ ప్రారంభం కష్టమని తెలుగుదేశం నేతలు భావిస్తున్నారు. అధికారంలోకి రాగానే నిర్వాసితులకు ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలకు అదనంగా ఇచ్చి వెలిగొండను ప్రారంభిస్తామని చంద్రబాబుతో చెప్పించేందుకు స్థానిక నేతలు నిర్ణయించారు. ఇదే వారికి ఆయుధంగా కనిపిస్తోంది. అయితే అక్టోబరు నాటికి దీన్ని ప్రారంభించేందుకు సాధ్యమవుతుందా? అందుకు ప్రభుత్వం ముందున్న ఎజెండా ఏమిటనేదీ చర్చ సాగుతోంది. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలకు వెలిగొండ కీలక ఎజెండా కానుంది. తెలుగుదేశం పార్టీకి ఏ మేరకు వెలిగొండ ఉపయోగపడుతుందనేది చూడాలి. ఎందుకంటే ప్రభుత్వం అక్టోబరు నాటికి నిజంగా దీన్ని పూర్తిచేసి ప్రారంభిస్తే లబ్ధి అంతా వైసిపికే దక్కుతుందని భావిస్తున్నారు. రెండో అంశం మార్కాపురం జిల్లా. దీని కోసం ఏడాది క్రితం అన్ని పార్టీలు జేఏసీగా ఏర్పాటై పోరాటం కొనసాగించాయి. వైసిపి ఎమ్మెల్యేలు కూడా జిల్లా కోసం లేఖలు ఇచ్చారు. పార్లమెంటు స్థానాల పరిధిలో జిల్లాలను చేశారు. మార్కాపురం ప్రాంత ప్రజలకు ఏమాత్రం పాలనాసౌలభ్యం కలగలేదు. దీనిపై మొన్న జరిగిన సిఎం సభలోనూ యువకులు ప్రస్తావించినా పట్టించుకోలేదు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు తెలుగుదేశం సిద్ధంగా ఉంది. ఈ విషయాన్ని అధినేత చంద్రబాబుతోనే ప్రకటన చేయించాలని జిల్లా నేతలు నిర్ణయించుకున్నారు. ఈ అంశం తెలుగుదేశం పార్టీకి సానుకూలం కానుంది. ఎన్నికల్లోనూ ఈ అంశాన్ని ప్రచారం చేసుకునేందుకు వీలుంటుంది. సంస్థాగతంగా చూస్తే తెలుగుదేశం పార్టీ ఈ ప్రాంతంలో 2004 తర్వాత బలహీనపడింది. 1999లో గిద్దలూరులో గెలిచాక తర్వాత మళ్లీ అక్కడ గెలుపు సాధ్యం కాలేదు. కంభం నియోజకవర్గంలో అప్పట్లో చప్పిడి వెంగయ్య గెలిచారు. తర్వాత కంభం నియోజకవర్గం రద్దయింది. మార్కాపురంలో అప్పట్లో జంకె వెంకటరెడ్డి స్వతంత్రంగా గెలిచి తెలుగుదేశంలో చేరారు. తర్వాత కందుల నారాయణరెడ్డి ఒకసారి గెలిచారు. వైపాలెం నియోజకవర్గం ఏర్పాటయ్యాక రెండుసార్లు వైసిపినే గెలిచింది. ఇక్కడ తిరిగి పార్టీకి బలం చేకూర్చే వ్యూహంలో చంద్రబాబు దృష్టి సారించారు. బలమైన నేతలను నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలుగా పెట్టారు. స్థానిక వైసిపి ఎమ్మెల్యేలపై ఉన్న అసంతృప్తులను తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో ఉన్నారు. రాజకీయ సమీకరణల్లో మార్పుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. చాలా రోజుల తర్వాత మూడు నియోజకవర్గాల్లో వరుసగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు పర్యటించడం గమనార్హం.

నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటే తెలియజేయండి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వేసవి కాలం దృష్ట్యా నగరంలో ఎక్కడైనా తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే తమకు తెలియజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తెచ్చిన ఎడల ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. సమస్యను తెలియ జేయాలనుకునే వారు కె బాలకోటయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ 9849907314 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-పామూరు

కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వకపోతే వారు ఎలా జీవించాలని సిఐటియు మండల కార్యదర్శి కె. మాల్యాద్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. కార్మికులకు జీతాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులను విధుల నుంచి అక్రమంగా తొలగించడం దురదృష్ట కరమన్నారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు జీతాలు అడిగితే పనులకు రావద్దని నిలుపుదల చేయడం అధికారులకు తగ్గదన్నారు. సమస్యలు పరిష్కారమైయ్యేంత వరకూ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో షేక్ అల్లాభక్షు, మహదేవయ్య, బాలచెన్నయ్య, సుజాత, ఆదిలక్ష్మి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కంభం రూరల్

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. స్థానిక కందులాపురం సెంటర్‌లో సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార భేరికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు తోట తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజల త్యాగాలతో స్థాపించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అదాని,అంబానీలకు అడ్డగోలుగా కట్టబెడుతుందని ఆరోపించారు. లౌకిక రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కి మనువాదాన్ని నెత్తికెత్తుకొని ప్రజల మధ్య కల్లోలం సృష్టిస్తుందన్నారు. రాష్ట్రాల హక్కు లను, విభజన హామీ లను విస్మరించి ప్రభుత్వ భూములు, గనులను కార్పొరేట్‌లకు కట్టబెడుతున్నారు. ఈనెల 23న గిద్దలూరులో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టి. దానం బేగ్, వెంకట్, సిపిఐ నాయకులు పుల్లయ్య, రమణ, జోసెఫ్, బాలిరెడ్డి, కొండయ్య, అంకయ్య, ఎఐటియుసి నాయకులు యోగయ్య పాల్గొన్నారు.

కార్మికుడిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - చీరాల

కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్యా యత్నానికి యత్నించిన ఆర్‌టిసి కార్మికుడిని చీరాల టూటౌన్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాపాడారు.అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. టూటౌన్ సిఐ సోమశేఖర్ కథనం ప్రకారం...చీరాల ఐక్య నగర్ రెండోవ కాలనీలో నివాసముంటున్న కాంట్రాక్ట్ ఆర్‌టిసి డ్రైవర్ దుడ్డు శామ్యూల్ తన భార్య పిల్లలతో గొడవ పడ్డాడు. అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్న సంయంలో తాను రైలు కింద పడి చనిపోతున్నానని తన మిత్రుడికి ఫోన్ ద్వారా చెప్పాడు ఆయన పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్.ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ బాజీత్, శివ ప్రసాద్, కానిస్టేబుల్ అహ్మద్ బాషా, వెంకటేశ్వర్లు సాంకేతిక పరిజ్ఞాన ద్వారా శ్యామూల్ అడ్రసు కనుగొని ఆయన్ని కాపాడారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టిడిపి కౌన్సిలర్ దారుణ హత్య

- పార్టీలోని గ్రూపుల పోరే కారణం
- రేపల్లెలో ఘటన

ప్రజాశక్తి -రేపల్లె

టిడిపి గ్రూపుల పోరులో కౌన్సిలర్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన రేపల్లె పట్టణ పరిధిలోని ఇసుకపల్లి వద్ద చోటు చేసుకుంది. అందిన సమాచారం ప్రకారం... రేపల్లె 14వ వార్డు కౌన్సిలర్ అన్నే రామకష్ణ (50) సోమవారం రాత్రి ఇసుకపల్లి వద్ద ఉన్న తమ గోశాలలో పనులు ముగించుకుని బైకుపై ఇంటికి వస్తున్నాడు. దుర్గ రైస్ మిల్లు సమీపంలోకి వచ్చే సరికి ముసుగులు ధరించి ఉన్న కొందరు దుండగులు ఆయనపై దాడి చేశారు. దీంతో రామకృష్ణ కేకలు వేయడం తో చుట్టుప్రక్కల వారు అక్కడి వచ్చారు.వారిని చూసి దుండగులు పరారీ అయ్యారు. స్థానికులు తీవ్రంగా గాయపడిన రామకృష్ణను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జామున మృతి చెందాడు. రామకష్ణ విశ్రాంత సైనికుడు, టిడిపి సానుభూతి పరుడుగా ఉన్నాడు. రేపల్లె పురపాలక సంఘం 14 వార్డు నుంచి టిడిపి తరుపున కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. రామకష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామకష్ణ మతి పట్ల ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



రామకృష్ణ(ఫైల్)

హత్యకేసుగా నమోదు : సిఐ

మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కౌన్సిలర్ రామకృష్ణది హత్య కేసుగా నమోదు చేసినట్లు సిఐ విజయచంద్ర తెలిపాడు. ఈ ఘటనలో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ప్లెక్సీల ఏర్పాటు విషయంలో ఏర్పడిన వివాదం కారణంగానే రామకృష్ణ హత్యకు గురైనట్లు సిఐ తెలిపారు.

హత్యకేసులో ఇద్దరు అరెస్టు

హంతకులు భార్య, అత్తే

ప్రజాశక్తి-వేటపాలెం

హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేసినట్లు చీరాల రూరల్ సిఐ ఎ.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ వివరాలు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం.. వేటపాలెం రైల్వేస్టేషన్‌కు పడమర వైపునున్న అంబేద్కర్ నగర్‌కు చెందిన సలగల శోభారాణి, అజయ్‌బాబు భార్యభర్తలు. గత కొంతకాలంగా అజయ్‌బాబు తన భార్య శోభారాణిని చిత్ర హింసలకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న మద్యం తాగి వచ్చి శోభారాణి చంపుతామని బెదిరించాడు. దీంతో శోభారాణి తన తల్లి నాగమ్మను పిలిపించింది. నాగమ్మ వచ్చి అజయ్‌బాబుతో మాట్లాడింది. అనంతరం అజయ్‌బాబు బెడ్‌రూంలో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో శోభారాణి ఇనుపరాడ్డులో అజయ్‌బాబును తీవ్రంగా కొట్టింది. దీంతో నుదురు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. మెదడు బయటకు వచ్చినపపటికీ మృతుడు కదులుతుండడంతో అజయ్‌బాబు చనిపోలేదని భావించి తన తల్లి చేకూరి నాగమ్మ సహాయంతో చుండిదార్ ప్యాంట్ నాడాతో గొంతుకు బిగించి హత్యచేశారు. అనంతరం మృతదేహాన్ని తీసుకొచ్చి వరండాలో ఉన్న బట్టలు ఉతికే బండపై పడేశారు. ఇంట్లోని రక్తపు మరకలను నీటితో కడిగి సాక్ష్యాలను రూపుమాపే ప్రయత్నం చేశారు. మృతడు తాగిన మైకంలో బండపై పడి చనిపోయినట్లుగా చీత్రికరించారు. అజయ్‌బాబు అన్న విజయ్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.చీరాల డిఎస్‌పి పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూరల్ సిఐ మల్లికార్జున రావు కేసు దర్యాప్తు చేపట్టారు. అందు భాగంగా నిందితులను ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. నిందితులు నేరాన్ని అంగీకరించారు. వద్ద నుంచి మృతుడి రక్తంతో తడిసిన దుస్తులును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తుకు సహకరించిన వేటపాలెం ఎస్ఐ జి.సురేష్, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించినట్లు సిఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ మల్లికార్జున

మినీలారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్ బస్సు

- ఒకరు మృతి
- 12 మందికి గాయాలు

ప్రజాశక్తి - కురిచేడు

మినీ లారీని ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో 12 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో వీరాయపాలెం గ్రామం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం ప్రకారం.... అల్లూరి సీతారామరాజు జిల్లా, రాజ బొమ్మాళి మండలానికి చెందిన వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం ప్రకాశం జిల్లాకు వచ్చారు. నూజెండ్ల మండలం నరసాయపాలెంలోని పోలేరమ్మ దేవాలయం వద్ద తాత్కాలిక నివాసాలుగా దేరాలు వేసుకున్నారు. అక్కడ నుంచి రోజూ చుట్టు ప్రక్కల గ్రామాలకు కూలీ పనులకు వెళ్లి వస్తున్నారు. అందులో భాగంగానే పొట్లపాడు గ్రామంలో పొగాకు పనుల కోసం మినీ ట్రక్కులో బయలు దేరారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి సిఎస్‌పురం వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు కురిచేడు మండలం, వీరాయపాలెం గ్రామం వద్ద మినీ వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో మినీ లారీలో ప్రయాణిస్తున్న 13 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరి పరిస్థితి విషయంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కొరకు వినుకొండకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగం నాగేశ్వర రావు (45) అనే వ్యక్తి మృతి చెందాడు.



మృతుడు నాగేశ్వరావు



క్షతగాత్రులు

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - రేపల్లె

రంజాన్ పండుగ సందర్భంగా తోఫా పంపిణీ చేయడం అభినందనీమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. పట్టణంలోని 25వ వార్డులో రంజాన్ పండుగ సందం ర్భంగా కౌన్సిలర్ అప్సాన జమీర్ ఆధ్వ ర్యంలో నిరుపేదలకు సోమ వారం రంజాన్ తోఫా అంజ దేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటర మణారావు మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దాతలు తమ వంతు సాయంగా నిత్యావసరాలు అందజే యడం అభినందనీయమని తెలిపారు. ఈ ర్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందజేస్తున్నమోపిదేవి

బాపట్ల : పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీదుల్లోని మౌజన్, ఇమామ్‌లకు టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ వేగేశన ఫౌండేషన్ ద్వారా రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో ముస్లింల కు రంజాన్ తోఫా , పేద ముస్లింకు దుల్హన్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని నిలిపివేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



రంజాన్ తోఫాఅందిస్తున్న నరేంద్ర వర్మ

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రమాద వశాత్తు రైలు నుంచి జారి పడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రాయవరం రైల్వే స్టేషన్ నుంచి గజ్జలకొండ వెళ్లే రహదారిలో మంగళవారం చోటుచేసుకుంది. ప్రభుత్వ రైల్వే పోలీసుల కథనం ప్రకారం... మార్కాపురం రైల్వే స్టేషన్ నుంచి గజ్జలకొండ వెళ్లే దారిలో స్టోన్ నెంబర్ 142/33-1 కెఎం వద్ద గుర్తు యువకుడు మతదేహం పడి ఉండడాన్ని రైల్వేట్రాక్‌మెన్ గుర్తించాడు. ఈ విషయం గురించి రైల్వేస్టేషన్ మాస్టర్ సమాచారం అందించాడు. స్టేషన్ మాస్టర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. హెడ్ కానిస్టేబుల్ హరికష్ణ రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మతుడు ఆకుపచ్చ రంగు ఫ్యాంటు, తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. మృతుడి వయస్సు సుమారు 24 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడ డంతో మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నంద్యాల ప్రభుత్వ రైల్వే ఎస్ఐ షేక్ జలీల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన మూల నారాయణమ్మ(49) భర్త మూల కష్ణారెడ్డి దంపతులకు వారి పూర్వీకుల ద్వారా సంక్రమించిన ఒకటిన్నర ఎకరా పొలం ఉండగా మరో తొమ్మిది ఎకరాల పొలమును కౌలుకు తీసుకొని మిరప పంటను సాగు చేశారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి తెగుళ్లు రావడంతోటి తీవ్ర నష్టం వాటిల్లింది. అప్పులు ఇచ్చిన వారి వద్ద నుండి ఒత్తిడి పెరగడంతో అప్పుల బాధ తాళలేక నారాయణమ్మ ఈనెల 16వ తేదీ ఉదయం తన పొలం నుంచి తెచ్చుకున్న పురుగుల మందును ఇంట్లో ఎవరూ లేని సమయంలో త్రాగి ఆత్మహత్య ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. నోట్లో నుంచి నురగ వస్తుండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించాలని సూచించడంతో కుటుంబ సభ్యులు ఒంగోలులోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 18వ తేదీన మతి చెందినట్లు మార్కాపురం గ్రామీణ ఎస్సై ఆర్ సుమన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మతురాలు మూల నారాయణమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

బల్లికురవ రూరల్ : ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపల జగనన్న కాలనీలలో గహ నిర్మాణాలు పూర్తి చేయ్యాలని ఎంపిడిఒ కష్ణ తెలిపారు. మండల పరిసత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో గహ నిర్మాణాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో గహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. ఈనెల 30లోపు ప్రభుత్వం నిర్దేశించిన 317 గహ నిర్మాణాలు పూర్తి చేయించి గహప్రవేశాలు జరిపించాలన్నారు. సొంత స్థలాలలో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారు కూడా గహప్రవేశాలు చేసేలా అధికారులు చొరవ చూపాలన్నారు.జగనన్న కాలనీలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసు కోవాలన్నారు. .గ్రామాలలో చేతిపంపులు చెడిపోతే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు.ఈ సమావేశంలో ఇఒఆర్‌డి సీతామాలక్ష్మి, హౌసింగ్ ఎఇ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌బాబు

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పెన్షను అమలు చేయాలని ఎపి జెఎసి జిల్లా చైర్మన్ సిహెచ్. సురేష్‌బాబు కోరారు. ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు చేయాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గుర్రం మురళీమోహన్, జిల్లా కో చైర్మన్ వై. శ్రీనివాసరావు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా ప్రెసిడెంట్ నరసారెడ్డి, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రామారావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హను మంతరావు, ఎఐటియుసి, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మణికుమార్‌ను పరామర్శిస్తున్న కరణం వెంకటేష్‌బాబు

విలేకరి మణికుమార్‌కు కరణం వెంకటేష్ పరామర్శ

ప్రజాశక్తి -చీరాల

ప్రజాశక్తి చీరాల విలేకరిగా పనిచేస్తున్న బెజ్జం మణి కుమార్ ఒంగోలులోని వెంకరమణ హాస్పిటల్‌లో ఇటీవల మోకాలుకు శాస్త్ర చికిత్స చేయించకున్నాడు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అందులో భాగంగా వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు విజయనగర కాలనీలోని మణికుమార్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. మణికుమార్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మణికుమార్‌ను పరామర్శించిన వారిలో వైసిపి నాయకుడు బుర్ల మురళి తదితరులు ఉన్నారు.

టిడిపి మైనారిటీ అధ్యక్షుడు అబ్రార్ మృతి

ప్రజాశక్తి బాపట్ల



అబ్రార్ (ఫైల్)

టిడిపి పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు షేక్ అబ్రార్(48) గుండె పోటుతో మంగళ వారం మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని పలువురు టిడిపి నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు. అబ్రార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అబ్రార్ మతి బాధాకరం : మాజీ ఎమ్మెల్సీ సతీష్ ప్రభాకర్

టిడిపి నాయకుడు అబ్రార్ మతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే సతీష్ ప్రభాకర్ తెలిపారు. అబ్రార్ మృతికి ఆయన సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపిపి మానం విజేత, మాజీ కౌన్సిలర్ సునీల్, టిడిపి నాయకులు సలగల రాజశేఖర్ బాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల అస్వస్థతకు కారణమైన

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి- రేపల్లె

విద్యార్థులకు అస్వస్థతకు గురికావడానికి కారణమైన వార్డెన్‌పై సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి నాసిరకమైన భోజనం తిని 19 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ నాయకులు స్పందించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్య, మనోజ్ కుమార్ మంగళవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్య, మనోజ్ మాట్లాడుతూ మెనూలో భాగంగా వడ్డించిన సాంబరులో పురుగులు రావడాన్ని విద్యార్థులు గమనించి హాస్టల్ పర్యవేక్షకుల దష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అవి పురుగులు కాదని, తాలింపు గింజలని తింటే ఏమి కాదని చెప్పినట్లు తెలిపారు. అప్పటికే సాంబారుతో భోజనం చేసిన 19 మంది విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పితో అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. హాస్టల్ సిబ్బంది కారణంగానే ఇలా జరిగినట్లు తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని వారు డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్ వారానికి ఒక సారి కూడా హాస్టల్‌కు రావడం లేదని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.



జిల్లా గిరిజన సంక్షేమ అధికారికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

'మార్గదర్శి'పై కక్షసాధింపు దారుణం

పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్



ముఖ్యమంత్రి జనగ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని కల్లబొల్లి కబుర్లు చెప్పి తీరా అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా వారి సమస్యలు పట్టించుకోవడం లేదని టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రస్తుతం ఒక్క ఖాతాదారుడు కూడా ఫిర్యాదు చేయకుండా మార్గదర్శిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడం దారుణ మన్నారు. ఎమ్మెల్యే ఏలూరి మంగళవారం మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనాడు కథనాలు ప్రసారం చేస్తోందనే అక్కసుతోనే సిఐడిని అడ్డుపెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ మార్గదర్శిపై చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఏదైనా సంస్థ ప్రమాదంలో పడితే ఖాతాదారులు ఊరుకోరని తమ డబ్బులు తిరిగి చెల్లించాలని ఆందోళన చేస్తారని తెలిపారు. మార్గదర్శి విషయంలో ఒక్క ఖాతాదారుడైనా ఫిర్యాదు చేశాడా అని ఏలూరి ప్రశ్నించారు. మార్గదర్శిని కుప్పకూల్చడం ద్వారా ఈనాడు ఆర్థిక మూలాలను దెబ్బతీయొచ్చని జగన్ రెడ్డి కుయుక్తులు పన్నుతున్నట్లు తెలిపారు. మార్గదర్శిలో తమ డబ్బులు భద్రంగా ఉన్నాయని, గడువు ముగిశాకే డబ్బులు తిరిగి తీసుకుంటామని ఖాతాదారులు కుండబద్దలు కొడుతున్నా జగన్ రెడ్డి టీమ్‌కి సిగ్గు రావడం లేదన్నారు. సోదాల పేరుతో మార్గదర్శి కార్యాలయాల్లో విలువైన డాక్యు మెంట్లు తరలించి బ్రాంచి మేనేజర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణ పేరుతో రామోజీరావు, శైలజ ఫొటోలను బహిర్గతం చేయించడం జగన్ రెడ్డి రాజకీయ కక్షసాధింపు కాక మరేమిటి అని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగానికి వ్యతిరే కంగా రూల్స్ అతిక్రమించి వ్యవహరిస్తున్న అధికారులు శిక్షార్హులే అన్న విషయాన్ని సిఐడి అధికారులు గుర్తించుకొని వ్యవహరించాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేసి డిపాజిటర్లకు చేరాల్సిన నిధులను మళ్లించిన జగన్ రెడ్డి ఏ మచ్చాలేని మార్గదర్శిపై కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం దుర్మార్గమని తెలిపారు. ఇకనైనా కక్షపూరిత రాజకీయాలకు జగన్ రెడ్డి స్వస్తిపలకాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఏలూరి హెచ్చరించారు.



జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బాపట్ల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్. విజయమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో నర్సులు రాత్రి వేళల్లో పిహెచ్‌సిల్లో విధులు నిర్వహించేందుకు భయపడుతున్నారు. అయినప్పటికీ నైట్ డ్యూటీలు చేయాల్సిందేనని వైద్యాధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. దుద్దుకూరు పిహెచ్‌సికి ప్రహరీ లేదని తెలిపారు. పిచ్చి చెట్లు పెరిగిపోయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో పాములు సంచరిస్తున్నాయని తెలిపారు. దుద్దుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రహరీ నిర్మాణంలో గ్రామపంచాయతీతో సంప్రదించి సమస్య పరిష్కారానికి కషి చేస్తామని జిల్లా వైద్యాధికారి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు చింతా శేషు బాబు, ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి మంజేష్, ప్రధాన కార్యదర్శి ఎం. ఉదయ లక్ష్మీ, ఉపాధ్యక్షులు ఎం. వందనా దేవి , విజయ్ కుమార్ , ఎం మహేష్ , షేక్ జానీ భాష , రమణా నాయక్, జానీ భాష, హాజన్ నాయక్ పాల్గొన్నారు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఆటలతో యువతకు ప్రోత్సాహం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి-పర్చూరు

యువతను ప్రోత్సహించేందుకు క్రీడలు ఉపయోగపడతాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. పర్చూరు అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో అఖిల భారత స్థాయి ఎన్‌టిఆర్ టి-20 క్రికెట్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఏలూరి యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పర్చూరులోని రిగ్వేద్ క్రికెట్ ప్రాంగణంలో ఈ పోటీలను మే 12 నుంచి 21 వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రథమగా బహుమతి రూ.5 లక్షలు, ద్వితీయ బహుమతిగా రూ. 3 లక్షలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు, నాలుగో బహుమతి రూ.1 లక్ష నగదు అందజేయనున్నట్లు ట్రస్టు ప్రతినిధి తులసి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల శేషగిరిరావు, మానం హరిబాబు, షేక్ షంషుద్దీన్, ఎవి.కృష్ణ, ఎం. హరిప్రసాద్, బి.రామాంజనేయులు పాల్గొన్నారు. తొలుత మసీదు నిర్వహించిన ప్రార్థనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి అల్పాహార విందులో పాల్గొన్నారు. అనంతరం ఉప్పుటూరులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
బుధవారం 19 ఏప్రిల్ 2023

డిగ్రీ ఫలితాలలో పిఎన్‌సిపి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సింగరాయకొండ


ప్రసన్న, రాధిక, శివనందిని

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలలో సింగరాయకొండ పిఎన్‌సిపి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి తెలిపారు. ఫలితాలలో బీఎస్సీ, ఎంపిసిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బీఎస్సీ అగ్రికల్చర్‌లో 90 శాతం, ఎంపీసీలో 907, బిఏలో 887, బీకాంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. తాటి తోటి ప్రసన్న 96 శాతం, రామలింగం రాధిక 93 శాతం ఉత్తీర్ణత సాధించగా.. అగ్రికల్చర్ విద్యార్థులు జి.ఆమని, ఎస్ కే సుమియా 86 శాతం, కామర్స్‌లో పి.నందిని, కె శ్రీకన్య, 76 శాతం సాధించారన్నారు. ఫిజిక్స్‌లో టి.ప్రసన్న 100 శాతం సాధించగా మ్యాథ్స్‌లో పదిమంది విద్యార్థులు 100శాతం మార్కులు సాధించారన్నారు. వీరిలో ఆర్ రాధిక, ఆర్ నందిని, పి మహేశ్వరి, కే శ్రీవిద్య, పి హేమశ్రీ ,సిహెచ్ గణేష్ ,ఎంఎల్ గౌతమి, బి స్రవంతి, డి సౌమ్య, పి పూజిత విద్యార్థులు ఉన్నారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డి నాగేశ్వరరావు, లెక్చరర్లు పల్లవి, ప్రసాద్ రావు, వెంకట్రావు, శివ మాబు, శ్రీకాంతు అభినందించడం జరిగింది.

'అమృత'లో నూరు శాతం ఫలితాలు

ప్రజాశక్తి-సింగరాయకొండ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ మూడో సెమ్ ఫలితాలలో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో అమృత ఫలితాలను సాధించినట్లు సింగరాయకొండ అమృత డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేశవరపు వెంకట శేషమ్మ తెలిపారు. బీఎస్సీ ఎమ్మెస్సీఎస్‌లో ఎస్‌డి కరిష్మా 96 శాతం, వెలమల శివ శంకర సాయి 93 శాతం, రావినూతల అనుజా 92 శాతం, బిఎస్సి ఎంపీసీఎస్‌లో కొవూరి వినయ్, పిన్ని సుబ్రహ్మణ్యం, బీఎస్సీ ఎంపీసీలో ఆవుల రుష్మిత, బీఎస్సీ బిజెడ్సిలో మల్లవరపు పూజిత 89 శాతం, చేవూరి ప్రియాంక 89 శాతం, బి.కామ్ కంప్యూటర్‌లో నూకసాని రమ్య శ్రీ 92.2 శాతం, కూనపురెడ్డి కుసుమ 92 శాతం, గద్దల శ్వేత 90.5 శాతం ఫలితాలు సాధించారన్నారు. ఈ విద్యార్థులను వెంకట శేషమ్మ అభినందించారు.




ఉత్తమ ఫలితాలు సాధించిన పొట్టి శ్రీరాములు కాలేజ విద్యార్థులు

పొట్టి శ్రీరాములు విద్యార్థుల విజయదుందుభి

ప్రజాశక్తి-దరిశి

డిగ్రీ ఫలితాలలో 3వ సెమిస్టరులో పొట్టి శ్రీరాములు విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారు. బిఎస్‌సి (మ్యాథ్స్) విభాగంలో పుల్లలచెరువు భువనేశ్వరి 391/400 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ నిలిచింది. కండె గంగోత్రి 362/400 మార్కులు సాధించింది. బిఎస్‌సి ఎంపిక్స్ విభాగంలో రాజకుమార్ నాయక్ 355/400 మార్కులు, బి.జడ్‌సి విభాగంలో పగడాల శ్రావణి 383/450 మార్కులు, బి.కామ్ కంప్యూటర్ విభాగంలో కుమిరిశెట్టి సుమాంజలి 288/350, గుజ్జుల నాగలక్ష్మి 280/350 మార్కులు సాధించారు. వీరిని కళాశాల యాజమాన్యం డాక్టరు పి. పెద్దిరాజు, వివి నారాయణ, పెద్దిరెడ్డి, భాస్కరరెడ్డి అభినందించారు.


విజయకేతనం చూపిస్తున్న గౌతమి విద్యార్థులు

'గౌతమి' విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి-దరిశి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ మూడవ సెమిష్టరు ఫలితాలలో స్థానిక గౌతమి డిగ్రీ కాలేజి విద్యార్థులు టౌన్‌ఫస్ట్ నిలిచారు. అగ్రికల్చర్ విభాగంలో పికిలి సాయమ్మ 413/450 మార్కులు, ఎంపిసి విభాగంలో యుద్దం కిరణ్ 341/400 మార్కులు, ఎంపిసిఎస్ విభాగంలో పోటు నాగజ్యోతి 385/400 మార్కులు, ఎంఎస్‌సిఎస్ విభాగంలో గుంటకాల అనిత 375/400 మార్కులు, బి.కామ్. కంప్యూటర్‌లో చెన్నుబోయిన వెంకటరవి 311/350 మార్కులతో టౌన్‌ఫస్ట్ నిలిచారు. ఈ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ యు. రవి, అధ్యాపకులు అభినందించారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

- ఏపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్‌వి.కృష్ణమోహన్ డిమాండ్
- నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సిపిఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ ఆర్‌వి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎపిజెఎసి అమరావతి అధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్‌వి కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 11వ పిఆర్‌సి అరియర్స్ ఇవ్వాలన్నారు. డిఎ అరియర్స్ విడుదల చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరించాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని, చనిపోయిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు కృష్ణమోహన్, విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర నాయకులు అబ్రైడ్, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర నాయకులు అర్జయ్య, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు విశ్వరూపాచారి, జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ నాయకులు అబ్దుల్లా, జిల్లా రెవెన్యూ సంఘ కోశాధికారి డానియల్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ప్రసన్న కుమార్, రెవెన్యూ కలెక్టరేట్ సంఘం అధ్యక్షులు ఊతకోలు శ్రీనివాసరావు, ఎస్‌టిఏ నాయకురాలు శివకుమారి, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉద్యోగులు నాయకురాలు సైకం శివ కుమార్, సిపిఎస్ ఉద్యోగుల నాయకుడు చంద్రశేఖర్, విఆర్‌ఏల సంఘ జిల్లా నాయకుడు ఎలీషా పాల్గొన్నారు.

ప్రచారభేరిని జయప్రదం చేయండి: సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి


ప్రచారభేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాబు

కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక ,నిరంకుశ విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు జరిగే ప్రచారభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు పేర్కొన్నారు. స్థానిక పంగులూరికృష్ణయ్య భవనంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి పల్లాపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఎస్‌కెమాబు మాట్లాడుతూ ప్రజల త్యాగాలతో స్థాపించుకున్న ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ఆదాని,అంబానీలకు అడ్డగోలుగా కట్టబెడుతున్న మోడీ విధానాలను గ్రామగ్రామాన ప్రచారం ప్రచారం చేయాలని కోరారు.సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ ఈనెల 30న సంతనూతలపాడు జరిగే బహిరంగసభలో సిపిఎం,సిపిఐ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. సభను జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రచారభేరి వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, మండల కమిటి సభ్యులు కంకణాల వెంకటేశ్వర్లు, తొట్టెంపూడి రామారావు, పొత్తూరి సురేష్, బెజవాడ శ్రీను, శీలం ఆదినారాయణ, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, పులి ఓబులరెడ్డి, నాగయ్య పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుతాం, దేశాన్ని కాపాడుదామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు అన్నారు. ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార బేరిలో భాగంగా మంగళవారం యర్రగొండపాలెం మండలంలో నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె వి కృష్ణ గౌడ్, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి. గురునాథం, త్రిపురాంతకం మండల కార్యదర్శి రామయ్య, సిపిఐ నాయకులు తిరుపతయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం


వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

క్విస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జాతీయ సేవా పథకం వారి అధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏప్రిల్ 17 నుండి ఏప్రిల్ 23 వరకు చెరువుకొమ్ముపాలెంలో నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం కిమ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని నగర మేయర్ గంగాడ సుజాత ప్రారంభించారు. కార్యక్ర మంలో క్విస్ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి, డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ వాసుబాబు, ఎన్.ఎస్.ఎస్. కార్యనిర్వహణ అధికారి కే.జయకృష్ణ పాల్గొన్నారు.

ఎపిడిసిఎం డైరెక్టర్‌ను కలిసిన నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం


శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

విజయవాడలో ప్రకాశం జిల్లా డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో విజయవాడలో ఎపి డిసిఎ డైరెక్టర్‌ని, గుంటూరులో ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కెరీని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఎపిడిసిఎ డైరెక్టర్‌ని మాజీ సదా వ్యవస్థపక అధ్యక్షుడు కృష్ణా రెడ్డి గారు నాయకత్వంలో జిల్లా అసోసియేషన్ నాయకులు అధ్యక్షుడు పర్వతాలు (బాలు), కార్యదర్శి పావులూరి శ్రీధర్, చిన్న, సతీష్ తదితరులు కలిసి రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి సత్కరించారు.


ఎంపిడిఒ కుసుమకుమారికి అర్జీ ఇస్తున్న నేతలు

పెండింగ్ వేతనాలివ్వాలని నిరసన

ప్రజాశక్తి-దరిశి

దరిశి మండలంలోని పలు గ్రామాలలో పారిశుధ్య కార్మికులకు (క్లాప్‌మిత్ర) పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలని సిఐటియు దరిశి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడిఒ కె కుసుమకుమారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు ఆలూరి ఇస్మాయిల్, నాగులూరి దానయ్య, ఆర్ ఆరోన్, బాలయ్య, ఆనందరావు, ఆర్ ఎడ్వర్, తిరుపతమ్మ, మరియమ్మ, ప్రసాద్, సుబ్బయ్యలు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్

ప్రజాశక్తి-మర్రిపూడి

మండలంలోని త్రాగునీటి ట్యాంకులకు మంగళవారం క్లోరినేషన్ చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ జయపాల్ తెలిపారు. మండలంలోని 18 ఓవర్‌హెడ్ ట్యాంకులు, 6 గ్రౌండ్ ఫ్లోర్ ట్యాంకులు ఉన్నాయన్నారు. మండలంలో 33 గ్రామాలకు రామతీర్థం రిజర్వాయర్ నుండి పైపులైన్లు ద్వారా ప్రతిరోజు త్రాగునీరు అందిస్తున్నారన్నారు. వేసవి కాలం కావడంతో నీటి అవసరం అధికంగా ఉంటుందని తమ సిబ్బందితో ట్యాంక్‌లను విడతల వారీగా శుభ్రం చేయించి మంచినీరు అందిస్తున్నామని తెలిపారు.

'శ్రీసాధన' విద్యార్థుల విజయం

ప్రజాశక్తి-మార్కాపురం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోమవారం సాయంత్రం ప్రకటించిన డిగ్రీ మూడవ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాల విద్యార్థులు 92 శాతం సగటు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతులమధుసూదన్ మంగళవారం తెలిపారు. బిఎస్‌సి బిజెడ్‌సి విభాగంలో బొందలపాటి సుధాలక్ష్మి 703/800 మార్కులు సాధించగా, బిఎస్‌సి ఎంపిసిఎస్‌లో బొడ్డోజు వెంకటనాగసాయి జాహ్నవి 658/750 మార్కులు సాధించారు. సయ్యద్ తస్లీమా నస్రీన్ 658/750 మార్కులు సాధించారని, స్టాటిస్టిక్స్ విభాగంలో తంగిరాల వెంకటనాగమణి 656/750, ఎంపిసి విభాగంలో గోగు శివవ 651/750, కటికె నాగ మోక్ష 649/750 మార్కులు సాధించారు. బీకాం కంప్యూటర్ విభాగంలో షేక్ అర్షద్ 563/700, చప్పిడి చిన్నబాబు 559/700, బీకాం జనరల్ విభాగంలో చిలకల దుర్గా భవాని 522/650 మార్కులతోనూ ఆయా విభాగాలలో అగ్రశ్రేణిలో నిలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ వివరించారు. గణితంలో ఇద్దరు, స్టాటిస్టిక్స్‌లో ముగ్గురు, తెలుగులో ఒక్కరు చొప్పున విద్యార్థులు శత శాతం మార్కులు సాధించగా, వివిధ అధ్యయన అంశాలలో 100 పైచిలుకు విద్యార్థులు 92 శాతం మార్కులు సాధించి సత్తా చాటారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డి.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు విఆర్‌కె ప్రసాద్, ఎంవి క్రిష్టారెడ్డి, డాక్టర్ వెన్నా క్రిష్టారెడ్డి, జివిఎల్ రమేష్‌బాబులతో పాటు కళాశాల అధ్యాపక సిబ్బంది అభినందించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి-మార్కాపురం


శ్రీనివాస్

మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కె.శ్రీనివాస్ చౌదరి ఎన్నికయ్యారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో మంగళవారం జరిగిన ఎన్నిక ఉత్కంఠభరితంగా ముగిసింది. అధ్యక్ష పదవి మినహా మిగిలిన అన్ని పదవులు ఏకగ్రీవంగా కావడం జరిగింది. అధ్యక్ష పదవికి న్యాయవాదులు కె.శ్రీనివాస్, భూపని కాశయ్య, సయ్యద్ జావీద్ అన్వర్‌లు తలపడగా ఎన్నిక తప్పనిసరిగా మారింది. ముగ్గురు అభ్యర్థులు నువ్వానేనా అన్నరీతిలో పోటీ ఇచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 116 ఓట్లు పోల్ జరిగింది. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన పైడిమర్రి రామచంద్ర, బత్తుల వేణుగోపాల్‌లు మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు జరిపారు. కె.శ్రీనివాస్‌కు 39 ఓట్లు, భూపని కాశయ్యకు 34 ఓట్లు, సయ్యద్ జావీద్ అన్వర్‌కు 32 ఓట్లు రావడం జరిగింది. దీంతో సమీప అభ్యర్థి భూపని కాశయ్యపై 5 ఓట్ల మెజార్టీతో న్యాయవాది కె.శ్రీనివాస్ విజయం సాధించారు.

'తాటిపర్తి' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-సింగరాయకొండ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. సింగరాయకొండ పంచాయతీలోని ఈద్గా మిట్ట దగ్గర ఉన్న షాదీ ఖానాలో ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఇఫ్తార్ విందులో వైసిపి నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్‌తో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి, వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు షేక్ లియాకత్, వైసిపి నాయకులు శీలం రాము పాల్గొన్నారు.

ఎస్‌విని విధుల నుంచి తొలగించాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అంబేద్కర్ ఫ్లెక్సీలను చించిన పుంగనూరు ఎస్సైను విధుల నుంచి తొలగించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరు జిల్లా పుంగనూరులో అంబేద్కర్ ఫ్లెక్సీల చించివేతకు నిరసనగా దళితులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో దళితులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం గడ్డపై

టిడిపి జెండా ఎగరాలి

- జగన్ ప్రభుత్వం పశ్చిమ ప్రాంతానికి అన్యాయం చేసింది
- అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం గడ్డపై టిడిపి జెండా ఎగరాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈనెల 21వ తేదీ టిడిపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యర్రగొండ పాలెం వస్తున్న నేపథ్యంలో మంగళ వారం స్థానిక ముస్లిం షాదీఖానాలో టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టిడిపి రాష్ట్ర యువనేత దామచర్ల సత్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశానికి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సంధర్బంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ జగన్ నెరవేర్చిన హామీలు ఏమిటంటే స్తంభాలకు రంగులు వేయడం, కనిపించిన బోర్డులన్నింటికి రంగులు వేయడం చేశారని తెలిపారు. ప్రస్తుతం గోడలకు స్టిక్కర్లు వేస్తున్నారని చెప్పారు. ఇక మిగిలింది మనం నిద్రపోతుంటే మన ఇళ్లకు వచ్చి మనకు రంగులు వేసే కార్యక్రమమే అని వ్యంగ్యంగా అన్నారు. భారీ సంఖ్యలో జన సమీకరణ చేసి చంద్రబాబు నాయుడు సభను జయప్రదం చేయాలని కోరారు. కొండెపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయులు మాట్లాడుతూ మంత్రి సురేష్ ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. 2009లో గెలిచి అభివృద్ధి మరిచారన్నారు. తిరిగి 2019లో గెలిచి మంత్రి అయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధిని మరిచారని తెలిపారు. నియోజకవర్గంలో దళితులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదని విమర్శించారు. మంత్రి అయిన వెంటనే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పి జిల్లాలు ఏర్పాటు చేసే సమయంలో పట్టించుకోలేదని ఆరోపించారు. ఇంకా పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టిడిపి రాష్ట్ర యువనేత దామచర్ల సత్య మాట్లాడారు. అనంతరం రాళ్లవాగు పక్కన గల ఖాళీ ప్రాంగణంలో చంద్రబాబు నాయుడు బహిరంగ సభ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ పరిశీలకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ మన్నె రవీంద్ర, చిట్టేల వెంగళరెడ్డి, శనగా నారాయణరెడ్డి, పయ్యావుల ప్రసాద్, గురిజేపల్లి జిలాని, షేక్ చిన్నవలి, షేక్ మస్తాన్‌వలి, సుబ్బారావు, కోటయ్య, కొత్తమాసు సుబ్రమణ్యం, వేగినాటి శ్రీనివాస్, తోటా మహేష్ నాయుడు, షేక్ ఇస్మాయిల్, రమణమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

డిగ్రీ ఫలితాల్లో 'శ్రీగౌతమి' ప్రభంజనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు వెలువడిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ సంవత్సరం 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. 2వ బిఎస్సీ అగ్రికల్చర్ నందు 450 మార్కులకు గాను 391 మార్కులతో బాణావత్ భూమిక బాయ్ డివిజన్ ఫస్ట్ సాధించింది. 385 మార్కులతో మేఘావత్ రాజేశ్వరి బాయ్ ద్వితీయ స్థానం పొందింది. 384 మార్కులతో మందపాటి సువర్ణ జ్యోతి తతీయ స్థానం కైవసం చేసుకుంది. అలాగే 2వ బిఎస్సీ కంప్యూటర్ నందు 400 మార్కులకు గాను 381 మార్కులతో కొమ్ము అశ్విత టౌన్ ఫస్ట్ సాధించడంతో పాటు 372 మార్కులతో గుమ్మా శివాంజలి ద్వితీయ స్థానం, 364 మార్కులతో నన్నెబోయిన రాజ్యలక్ష్మి తతీయ స్థానం, 2వ బికాం కంప్యూటర్ నందు 350 మార్కులకు గాను 270 మార్కులతో కటారు శిరీష మొదటి స్థానం, 269 మార్కులతో ఆవుల సంపూరణ ద్వితీయ స్థానం, 262 మార్కులతో మారపాకుల పవన్ కుమార్ తతీయ స్థానం, 2వ బిఏ నందు 300 మార్కులకు గాను 224 మార్కులతో తంగిరాల హర్షిత మొదటి స్థానం, 218 మార్కులతో కుర్ర అంజిబాబు ద్వితీయ స్థానం, 208 మార్కులతో ధార వెంకట అంజలి తతీయ స్థానం సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శ్రీ గౌతమి విద్యా సంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి, ప్రిన్సిపాల్ సవలం రవిబాబుతో పాటు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రాష్ట్రానికి పెద్ద దిక్కు జగన్: ఎంపిపి

ప్రజాశక్తి-పొదిలి

ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదలకు అన్ని రకాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ రాష్ట్ర భవిష్యత్తుకు పెద్దదిక్కు అని మర్రిపూడి ఎంపిపి వాకా వెంకట రెడ్డి అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం గ్రామంలో జగనన్నే ఈ రాష్ట్ర భవిష్యత్తు కార్య క్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అన్నిసామాజిక వర్గాల వారికి సమ న్యాయం చేయడం కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు అందనంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో అత్యధికంగా ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్రంలో మనం ముందున్నామన్నారు. భవిష్యత్తులో ఈ పథకాలను కొనసాగిస్తూ తిరిగి జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వపథకాలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి యువనాయకులు గుంటూరి పిచ్చి రెడ్డి, గ్రామ నాయకులు దోర్నాల చిన్న నారాయణ రెడ్డి, గుంటూరి నాగిరెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఈశ్వర రెడ్డి, మీగడ చిన్న ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి వాకా వెంకటరెడ్డి

మద్యం బెల్టుషాపులను అరికట్టాలి..

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కారుమంచి గ్రామంలో మద్యం బెల్ట్ షాపులను అరికట్టి గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) జిల్లా కార్యదర్శి వి మంజుల విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు కారుమంచి పంచాయతీ కార్యదర్శి ఎ రామకష్ణకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందుబాబులు గ్రామంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ లోనే మద్యం సేవిస్తున్నారన్నారు. దీంతో బస్సు ఎక్కడానికి అక్కడికి వచ్చే మహిళలు నిలబడేందుకు కూడా ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వల్ల తరచూ వివాదాలు జరుగుతూ గ్రామంలో శాంతిభద్రతల సమస్య కూడా తలెత్తుతుందని చెప్పారు. గ్రామంలో కూలి పనులు చేసుకునేవారు మద్యానికి బానిసలై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలోనే గ్రామ మహిళా పోలీస్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆమె పట్టించుకోలేదని ఆరోపించారు. అదేవిధంగా గ్రామంలోని వాటర్ ప్లాంట్ కు వెళ్లే దారిలో కొంతమంది నిత్యం పేకాట ఆడుతున్నారని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన మద్యం, పేకాట లను అరికట్టి గ్రామంలో శాంతిభద్రతల సమస్యను కాపాడాలని వారు పంచాయతీ కార్యదర్శికి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై గ్రామ మహిళా పోలీస్ జయంతి ని ప్రజాశక్తి మంగళవారం వివరణ కోరగా గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు గతంలో తన దష్టికి వచ్చిందన్నారు. అయితే తన విధులు ముగిసిన అనంతరం రాత్రి సమయాలలో తాము పట్టుకునేందుకు వీలు లేకుండా ఒకటి లేదా రెండు మద్యం సీసాలు బంకులలో పెట్టుకుని విక్రయిస్తున్నట్లు తెలిపారు. టంగుటూరు ఎస్సై తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యు జిల్లా మహిళా నాయకులు ఎన్ వేణి రవీంద్ర, సిహెచ్ వరకుమారి, చందన, శతి, సింధు, పిడి ఎస్ యు నాయకులు సిసింద్రీ బాబు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా సచివాలయ వెల్ఫేర్ అధికారి ఉషారాణి

ఆధార్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని చింతలపాలెంలో వున్న ప్రత్యేక ఆధార్ సెంటర్‌ని జిల్లా సచివాలయ వెల్‌ఫేర్ అధికారి పి.ఉషారాణి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆధార్ సెంటరులో 11 మందికి ఆధార్ సేవలు అందించినట్లు తెలిపారు. సచివాలయ సేవలను పెంపుదల చేయవలసిందిగా సిబ్బందిని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ పూర్తి చేయాలని సిల్క్‌హబ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. జరుగుమల్లి సచివాలయాన్ని తనిఖీ చేసి సచివాలయానికి వచ్చు సందర్శకులకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ పి.రామకృష్ణ, జరుగుమల్లి సచివాలయ సెక్రటరీ రామ్మోహనరావు, చింతలపాలెం సచివాలయ సెక్రటరీ కిషోర్ జరుగుమల్లి, చింతలపాలెం సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం యర్రగొండపాలెంలోని పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యర్రగొండపాలెం అగ్ని మాపక అధికారి బి హరీష్ ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల నందు అగ్గి పెట్టెలు వెలిగించడం, సెల్‌ఫోన్ మాట్లాడడం, లైటర్ వెలిగించడం, బీడి, సిగరేటు కాల్చడం లాంటివి చేయకూడదన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది సిహెచ్ కాశి విశ్వనాథ్, వి వెంకటేశ్వర్లు, సిహెచ్‌వి రవిబాబు, డి పీరావలి, డి వెంకటేశ్వర్లు, ఎం తార్యా నాయక్, బి రాంజీ నాయక్, బి ఆంజనేయులు, డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల తనిఖీ

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని రావలకొల్లు గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనిని మండల అదనపు ప్రోగ్రామ్ అధికారి ఎస్.మాచర్ల మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి మాస్టరును పిలిచి వచ్చిన వారికి హాజరు వేసి పనికి రాని వారికి ఆబ్సెంట్ వేశారు. కూలీలతో ప్రతిరోజు కూడా 6 గంటలకి పని ప్రారంభించి 11 గంటల వరకు పని చేయాలని సూచించారు. ప్రతి రోజూ ఒక మనిషికి రూ.272లు వచ్చే విధంగా టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా మార్కింగ్ తీసుకొని తదనుగుణంగా ఫీల్డ్ అసిస్టెంట్ పని చేయించాలన్నారు. కూలీలు కూడా సరైన విధానంలో పని యొక్క టాస్క్‌రేట్‌కు అనుగుణంగా పని చేయాలని ఎపిఒ కూలీలకు అవగాహన కలిపించారు. పని ముగింపు చివరి రోజున టెక్నికల్ అసిస్టెంట్, మేట్‌లు మరియు పని చేసిన కూలీల సమక్షంలో ఆ వారం మొత్తానికి ఎంత కూలీ పడిందీ టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా సవివరముగా కూలీలకు తెలియజేయాలన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహం దగ్ధం

ప్రజాశక్తి-పొదిలి

విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో గహం దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పొదిలి పట్టణంలోని విశ్వనాథపురం ఒకటో లైన్ చివర ట్రాన్స్ఫార్మర్ సమీపంలో నివాసం ఉంటున్న పందీటి ప్రేమానందంకు ఇంట్లో తెల్లవారుజామున విద్యుత్‌షార్టు సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. కుటుంబసభ్యులు తేరుకునే లోపు మంటలు పెరగడంతో కుటుంబసభ్యులు బయటకు వచ్చారు. ఇంటిని చుట్టుముట్టిన మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే గహం పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో గహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫ్రిడ్జ్ వాషింగ్ మిషన్ ఏసీ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఈ ఘటనలో గహం గోడలు పూర్తిగా దెబ్బతిని పెచ్చులు ఊడి పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రూపాయలకు పైగా ఆస్తి నష్టం జరగడంతో పాటు గహం పూర్తిగా దెబ్బతిందని బాధితులు వాపోతున్నారు.

గొట్లగట్టులో 'మా నమ్మకం నువ్వే జగన్'

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో మంగళవారం మండలంలోని గొట్లగట్టులో అట్టహాసంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీపీ మొరబోయిన మురళీకష్ణ యాదవ్, మండల కన్వీనర్ మోరా శంకర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి సచివాలయ కన్వీనర్లు గాడి కోనేటి రెడ్డి, అనకు ఏడుకొండలు, నాగం ప్రసాదు వార్డు మెంబర్ ఉబ్బరపు చిన్న కాశయ్య, నాయకులు పెద్ద కాశయ్య, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గిరిజన గూడేల్లో వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల బిళ్లగొందిపెంట, పోతురాజుపెంట, గౌతమ బుద్ధుని కాలనీ, పున్నయ్య కుంట తదితర గిరిజన గూడేల్లో వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి కోటేశ్వరరావు ఆదేశాల మేరకు వైద్య శిబిరాలు నిర్వహించారు. వంద మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితులకు రక్తపూతలు తీసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. గర్భిణీలు, చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేశారు. గజ్జి, తామర లాంటి చర్మ వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లిక, శ్రావణి, పి ఆవులయ్య, లక్ష్మీదేవి, రోసిలిన్, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, అంకమ్మ, బయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఏ.కొత్తపల్లి, అంబవరం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రేగులచెలుక, గనేశునిపల్లి, డీజీపేట గ్రామాల్లో 2020 సంవత్సరంలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఇంతవరకు బిల్లులు చెల్లించ లేదని తెలిపారు. ఎపిఒ నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు. **పిసిపల్లి :** ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, అందుకోసం తక్షణమే బడ్జెట్‌ను విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మారెళ్ళ, అలవలపాడు, వడ్డేపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నెలల తరబడి బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మెట్లు పి.మల్లికార్జున, కె.మల్లేశ్వరి, చేర్చి రమణమ్మ, సత్తెనపల్లి పద్మకుమారి, పి.విజయలక్ష్మి, రమణ, బండారు రామకష్ణ, బత్తుల లక్ష్మయ్య, బత్తుల పూర్ణారావు పాల్గొన్నారు.



సిఎస్‌పురంలో కూలీలతో మాట్లాడుతున్న ఉసా వెంకటేశ్వర్లు



సిఎస్‌పురంలో కూలీలతో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-సిఎస్.పురం

కనిగిరి రోడ్డులోని ఎస్‌సి పాలెం వద్ద ఉన్న బోరు నీరు తెచ్చుకొనేందుకు వీలు లేకుండా పాత ఇనుప కొట్టు యజమాని సామను అడ్డుపెడుతున్నాడుని, వాటిని తొలగించాలని కోరుతూ సిపిఎం నాయకుడు గుర్రం లక్ష్మయ్య ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ వేసవిలో నీటికోసం నానా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బోరు విషయం గురించి అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. చుట్టూ ఉన్న వస్తువులు తొలగించ కుండా ఇనుప కొట్టు యజమాని ఇష్టాను సారంగా వ్యవహరి స్తున్నారన్నారు. చేతిపంపుకు అడ్డంగా ఉన్న వస్తువులు తొలగిస్తే నీరు కొట్టుకొట్టుకొనేందుకు వీలుంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు చుట్టూ పెట్టిన పాత ఇనుప సామగ్రిని తొలగించాలన్నారు.

నరసయ్యకు మాతృవియోగం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్యకు మాతృవియోగం కలిగింది. ఆయన మాతమూర్తి మురహరి చిన్నమ్మ(80) వద్ధాప్య, అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందింది. టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు శ్యామల వెంకటేశ్వర్లు, చీకటి వెంకటసుబ్బయ్య, గంట శ్రీనివాస్‌రెడ్డి, కోటపాటి శేషయ్య, రమేష్‌రెడ్డి తదితరులు చిన్నమ్మ మతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : సూరగాని

ప్రజాశక్తి- చీరాల

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలోనే ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నట్లు చీరాల 5వ వార్డు కౌన్సిలర్ సురగాని లక్ష్మి నరసింహారావు తెలిపారు. 5వ వార్డు పరిధిలోని అవ్వరు వారి వీధిలో మానకమ్మం జగనన్నే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రకజలు ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని తెలిపారు. రాష్ట్ర అభివద్ధి వైసిపితోనే సాధ్యమన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల అభివద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యజమానులతో అనుమతితో గృహాలకు స్టిక్కర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పడవల భవాని, ధనుంజయుడు,మోపిదేవి భారతి, కాశీ హరీష్,గహ సారథులు రామకష్ణ, గోలి హేమలక్ష్మి పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న సూరగాని లక్ష్మి

పిట్టలవానిపాలెంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసమని ఎమ్మెల్యే కోనా రఘుపతి తెలిపారు. మండల పరిధిలోని చందోలు గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందు ఆయన పాల్గొన్నారు. తొలుత పెద్ద మసీదు లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ముస్లిం సోదరుల రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొనిముస్లిం సోదరులు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బాజీ, రహదారుల డైరెక్టర్ హుస్సేన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కోన రఘు పతి

'వాత్సల్య'తో అనాథ బాలలకు ఆర్థిక చేయూత

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ప్రజాశక్తి అద్దంకి

అనాథ బాలలకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మిషన్ వాత్సల్య కార్యక్రమంలో ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ తల్లి దండ్రులను కోల్పోయి అనాధ చిన్నారులు, 18 సంవత్సరాల లోపు వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాఘవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఐ ఆదిలక్ష్మి, సిడబ్ల్యుసి మెంబర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు. **రేపల్లె :** మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలకు లబ్ది చేకూరుతుందని ఇన్‌ఛార్జి సిడిపిఒ మాణిక్యం తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కారాక్యలయంలో అంగన్‌వాడీలకు వాత్సల్య పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సుకలిగి పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ తల్లితండ్రులు కోల్పోయిన పిల్లలకు ఈ పథకానికి అర్హులని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకొనేందుకు ఈనెల 30 వరకూ గడవు ఉన్నట్లు ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న బత్తుల పద్మావతి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాతలు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీ క్లబ్ పర్చూరు మరియు పర్చూరు గంగ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కొమ్మాలపాటి బ్రహ్మానందం జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శి కట్టా రాణి ప్రారంభించారు. మజ్జిగ పంపిణీని ఎఎస్ఐ పి.కోటేశ్వరరావు ప్రారంభించారు. చలివేంద్రం నిర్వహణ దాత తోకల కృష్ణమోహన్‌ను క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, పోలిశెట్టి చంద్రం, రోటరీ ట్రస్ట్ అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, సభ్యులు కోట శ్రీనివాసరావు, కొల్లా నరేంద్రకుమార్, కోట హరిప్రసాద్, పాబోలు వెంకన్న, ఎం.వెంకటసుబ్బయ్య, మల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

అగ్ని ప్రమాదాల పట్ల ఆయిల్ కంపెనీల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు అగ్నిమాపక శాఖ అధికారి ఆనం రమణారెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా మండలంలోని సూరారెడ్డిపాలెం వద్ద ఉన్న ఐఒసి ఆయిల్ కంపెనీ సిబ్బందికి ప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయిల్ లోడింగ్, అన్ లోడింగ్ సమయాలలో కంపెనీల సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు - నివారణ అంశాలపై ఐఓసీ సిబ్బందికి క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఒ రమణారెడ్డి, సిబ్బంది బంగారుబాబు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, మురళి రావు, శ్రీనివాసులు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

నిత్యావసరాలు అందజేత

కొమరోలు : రంజాన్ మాసం సందర్భంగా వ్రక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నజీర్ బాషా జ్ఞాపకార్థం ఆయన కుమారులు పేదలకు నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమరోలు ఎంపిపి కామూరి అమూల్య, అర్థవీడు జడ్‌పిటిసి చెన్ను విజయమ్మ, తాటిచర్ల, నల్లగుంట్ల ఎంపిటిసిలు కామూరి శ్రీనివాసరెడ్డి, సిహెచ్. వెంకటేశ్వరరెడ్డి, వైసిపి ఎన్‌ఆర్ఐ విభాగం నాయకుడు సయ్యద్ రఫీ, య్యద్ అన్వర్, సయ్యద్ ఉస్మాన్, సయీమ్, బాధరయ్య పాల్గొన్నారు.

హెల్త్ విజిటర్ వేధింపులు భరించలేక..

- ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం - తప్పిన ప్రాణాపాయం


ఆశా కార్యకర్తను పరామర్శిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వహిస్తున్న శాంతి ఏంజెల్ ఆగడాలకు మనస్థాపం చెందిన ఆశా కార్యకర్త నీలం అరుణజ్యోతి మాత్రలు మింగి ఆత్మహత్యానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే..త్రిపురాంతకం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అరుణ జ్యోతి అనే వితంతు మహిళ ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తుంది. ఆమె ఆశా వర్కర్‌గా కాకముందే భర్తను కోల్పోయింది. ఇది గమనించిన గ్రామ పెద్దలు అప్పట్లో ఆశా కార్యకర్తగా నియమించారు. అప్పటి నుంచి ఆమె విధులు నిర్వహిస్తోంది. కరోనా సమయంలో బాధ్యతా యుతమైన విధులు నిర్వహిస్తున్న సమయంలో తన చిన్న కుమారుడు కిరణ్ గుండె పోటుతో మృతి చెందడంతో తీవ్ర మనస్థాపానికి గురై అనారోగ్యం బారిన పడింది. ఈ మధ్య కాలంలో వచ్చిన ఆరోగ్య పర్యవేక్షకురాలు శాంతి ఏంజెల్ జిల్లాలో ఎక్కడా లేని విధంగా త్రిపురాంతకంలోని ఆశాలపై, ఆరోగ్య కార్యకర్తలపై తనదైన శైలిలో పెత్తనం చెలాయిస్తుంది. తనకు లంచం ఇవ్వాలంటూ వారిని అనేక విధాలుగా వేధిస్తోంది. లంచం పుచ్చుకోవడానికి వారి వద్ద రికార్డులు సరిగా లేవంటూ, రోజుకో రికార్డు రాయిస్తూ వారికి ఆర్థికంగా, మానసికంగా వేధిస్తూ మీకు నెలలో మూడుసార్లు చేసే ఉద్యోగానికి రూ.10 వేలు అవసరమా అంటూ, మీకు చేతకాకపోతే నాకు డబ్బులు ఇస్తే రికార్డులు రాసుకుంటానంటూ వారిని బెదిరిస్తూ అశా..ఒశా..గాడిద.. అంటూ పరుష పదజాలాలతో తిడుతూ అందరినీ భయ భ్రాంతులకు గురి చేస్తోంది. గత శనివారం బ్రహ్మం గారి కాలనీలో తనిఖీలకు వచ్చి అక్కడ ఉన్న ప్రజల మధ్యలో, తోటి ఉద్యోగుల మధ్యలో అరుణ జ్యోతిని రికార్డులు చూపించాలంటూ చెప్పడంతో అరుణ జ్యోతి తన వద్ద ఉన్న రికార్డులు చూయించగా వాటిని చించి నోటితో ఉచ్చరించలేటువంటి మాటలు మాట్లాడుతూ ఆమెను అవమానం పరచడంతో మనస్థాపానికి గురై శని, ఆదివారాలు మౌనంగా ఉండడంతో తోటి ఉద్యోగులు ఆమెకు ఫోన్‌లో పలకరించేందుకు ప్రయత్నించగా ఆమె ఎత్తలేదు. సోమవారం ఆమె ఇంట్లో ఉన్న మాత్రలు మింగింది. ఆమె వదిన గమనించి.. ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించగా ఆమె కోలుకుంది. ఈ విషయమై అరుణ జ్యోతిని వివరణ కోరగా తనను నానా దుర్భాషలాడుతూ, మూడు వారాల నుంచి తనను వేధిస్తుందని, నాకు డబ్బులు ఇవ్వకపోతే నువ్వు ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని హెచ్చరించడంతో అవమానం తట్టుకోలేక రెండు రోజులుగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆశా కార్యకర్తలను వేధిస్తున్న హెల్త్ విజిటర్‌పై చర్యలు తీసుకోవాలని తోటి కార్యకర్తలు డిమాండ్ చేశారు.


నగరంలో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు మంగళవారం నగరంలోని పలు చోట్ల జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. 60 అడుగుల రోడ్డు చివర పోతురాజు కాలువలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాల్వ పక్కన పేరుకు పోయిన చెత్త దిబ్బలను తొలగించాలని ఆదేశించారు. జెసిబి సాయంతో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. పోతురాజు కాలువ పరిసరాల్లో తిరుగుతున్న పందుల యజమానులకు నోటీసులు జారి చేయాలని చెప్పారు. తరువాత సెయింట్ థెరిస్సా స్కూల్ ప్రాంతంలో డ్రెయినేజీ శుభ్రత పనులను పరిశీలించారు. సెయింట్ థెరిస్సా స్కూల్‌లో బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన నేపథ్యంలో అక్కడ చేప ట్టాల్సిన పారిశుధ్య పనుల గురించి సిబ్బందితో చర్చించారు. తరువాత మంగమూరు రోడ్డులోని కళానికేతన్ పక్కన మురుగు కాలువ పారుదలకు అడ్డంకిగా ఉన్న వ్యర్థాలను పరిశీలించి వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరి సూపర్ వైజర్ ఎన్ పిచ్చయ్య ఉన్నారు.

వైసీపీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి

పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు, మంత్రి సురేష్


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ శ్రేణులంతా సమన్వయంతో పని చేసి పార్టీని మరింత అభివద్ధి చేసేందుకు కషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ బీద మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. యర్రగొండపాలెంలోని వైష్ణవి గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన యర్రగొండపాలెం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎంపీ బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రూప్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గత సీఎంలతో పోలిస్తే ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందిన సీఎం జగన్ ఒక్కరేనని అన్నారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఏకైక సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు అభివద్ధి, సంక్షేమ ఫలాలు అందించారని తెలిపారు. ప్రతి గడపలో ప్రజలు అపూర్వ స్వాగతం పలకడమే అందుకు నిదర్శనమన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకులు పి రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. సమావేశంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఐదు మండలాల ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, మందా లాజరు, కోట్ల సుబ్బారెడ్డి, బెజవాడ పెద్దగురవయ్య, గుమ్మా పద్మజ, జడ్పిటిసిలు చేదూరి విజయభాస్కర్, వాగ్యా నాయక్, మాకం జాన్‌పాల్, లతాబాయి, ఏరువ చలమారెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, బివి సుబ్బారెడ్డి, లింగారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, ఏకుల జయమ్మ ముసలారెడ్డి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పురోభివృద్ధికి సహకరించాలి

కలెక్టర్ రంజిత్‌బాషా



పూర్వ కలెక్టర్ విజయకృష్ణన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా పురోభివద్ధికి అధికారులంతా తమ సహకారం అందించాలని కలెక్టర్ రంజిత్‌బాషా కోరారు. బాపట్ల జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన పూర్వ కలెక్టర్ కె విజయకృష్ణన్, పూర్వ జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులుకు వీడ్కోలు, నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషా, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్.శ్రీధర్‌కు ఆహ్వాన అభినందన కార్యక్రమం జిల్లా గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బాపట్ల కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. అసందర్భంగా పూర్వ కలెక్టర్, జేసీలకు శాలువాలు కప్పి పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రస్తుత కలెక్టర్, జేసీలను ఆహ్వానిస్తూ అధికారులు ఘనంగా సత్కరించారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసినప్పుడే జిల్లాను అభివద్ధిలోకి తీసుకొని వెళ్లగలమని కలెక్టర్ తెలిపారు. జిల్లా పురోగతి సాధించ లేకపోతే సహించేది లేదన్నారు. మీ విధి నిర్వహణలో ఎంతమంది పేదలకు సహాయం చేశామనే ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. పూర్వ కలెక్టర్, జేసీలు మంచి పేరు సంపాదించారన్నారు. బాపట్ల జిల్లా ప్రజలు అందించిన సహకారం, ప్రేమానురాగాలు ఎన్నడు మరువలేనివని బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ విజయకష్ణన్ అన్నారు. బాపట్ల జిల్లా పురోభివద్ధికి యంత్రాంగం అహర్నిశలు కషి చేసిందన్నారు. జిల్లాతో ఏర్పడిన అనుబంధాన్ని ఈ సందర్భంగా పంచుకున్నారు.పొరుగు జిల్లాలతో సమానంగా బాపట్లను నిలబెట్టడంలో తొలి కలెక్టర్ గా విజయకష్ణన్ చేసిన కషి అభినందనీయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. వనరులు సమకూర్చడంలో, పాలనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారని వివరించారు. ఉన్నతమైన ఆలోచనలతో పని చేసి బాపట్ల చరిత్రలో నిలిచి పోయారని ఆయన చెప్పారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు కలెక్టర్ అందించిన సహకారాన్ని మరువలేనన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ గా శ్రీనివాసులు నిరంతరం కషి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలందరికి తీసుకువెళ్లడంలో పూర్వ కలెక్టర్, జెసిలు అహర్నిశలు పనిచేశారని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అన్నారు.

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా అభివద్ధిలో తొలి కలెక్టర్ గా విజయకష్ణన్ చెరగని ముద్ర వేసుకున్నారని జిల్లా రెవెన్యూ అధికారిని కె లక్ష్మి శివజ్యోతి తెలిపారు. ఎన్నో విజయాలు సాధించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వ సంయుక్త కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా అదనపు ఎస్పీ మహేష్, బాపట్ల, రేపల్లె ఆర్‌డివోలు జి రవీందర్, పార్థసారథి, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు బి.అర్జున్ రావు, జి భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన శస్త్రచికిత్స

యువకుడి కాలుకి అత్యవసర ఆపరేషన్ చేసిన ప్లాస్టిక్ సర్జన్

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్‌లో యువకుడి కాలికి అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఒంగోలు, భాగ్యనగరానికి చెందిన 35 ఏళ్ల మద్దిరెడ్డి రవీంద్రారెడ్డి చెట్టుని రంపం మెషిన్‌తో కోస్తున్నప్పుడు తన కుడి కాలి మోకాలి కింద భాగం కోసుకుంది. దీంతో మోకాలి కింది భాగానికి రక్త ప్రసరణ చేసే రక్తనాళం, నరం తెగాయి. దీని వల్ల పేషెంట్‌కు అధిక రక్తస్రావం జరగటంతో పేషెంట్‌ను కిమ్స్ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌కు తీసుకొచ్చారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ యస్.నాగశ్రీకాంత్ పేషెంట్‌ను పరిశీలించి వెంటనే శస్త్రచికిత్స చేయాలని బంధువులకు తెలిపారు. డాక్టర్ శ్రీకాంత్, అనస్తీయాలజీ చీఫ్ డాక్టర్ రామకష్ణ, డాక్టర్ అనూష, ఇతర వైద్యబందం సుమారు ఐదు గంటల పాటు శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగశ్రీకాంత్ మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సను లేటుగా చేస్తే యువకుని కాలు గాయానికి కింద భాగం తొలగించాల్సి వస్తుందని, అధిక రక్తస్రావం వల్ల ప్రాణానికి ముప్పు వాటిల్లేదని తెలియజేశారు. ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఐదు గంటల నుండి 8 గంటల వ్యవధిలో శస్త్రచికిత్స చేస్తే పేషెంట్‌కు హాని కలగకుండా కాపాడవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యస్.నాగశ్రీకాంత్ మాట్లాడుతూ ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో వైద్యసేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యబందాన్ని కిమ్స్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ యస్.నాగశ్రీకాంత్‌ను, అనస్తీయాలజీ చీఫ్ డాక్టర్ రామకష్ణని, డాక్టర్ అనూషని అభినందించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి మాట్లాడుతూ మెట్రోనగరాలకే పరిమితమైన ప్లాస్టిక్ సర్జన్ సేవలు ఇప్పుడు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.


శస్త్రచికిత్స జరిగిన యువకుడి కాలు